ప్రజాశక్తి

బుధవారం 11 జూన్ 2025

5

పార్వతీపురం మన్యం

టెన్త్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలకు ప్రశంసలు

సీతంపేట : ఈ ఏడాది పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన వారిని, ఉపాధ్యాయులను ప్రధానోపాధ్యాయులను ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ప్రశంసించారు. స్థానిక ఐటిడిఎలో మంగళవారం ప్రధానోపాధ్యాయులు హెచ్‌డబ్ల్యుఒలతో సమావేశం నిర్వహించారు. తక్కువ ఫలితాలు వచ్చిన వారిని అందుకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఇకపై మంచి రిజల్ట్ రావడానికి కృషి చేయాలని చెప్పారు. పాఠశాల తెరిచే నాటికి పరిసరాలు శుభ్రంగా ఉండాలని, పొదలు మొదలైన తొలగించాలని వాటర్ ట్యాంక్ ఆర్‌ఒ ప్లాంట్ శుభ్రం చేయించాలని, డార్మెటరీలో అన్ని కిటికీలకు అమర్చడం పూర్తి చేయాలని అన్నారు. మలాథియన్ స్ప్రే చేయించాలని విద్యార్థులు చేరిన వెంటనే 100శాతం ఆరోగ్య పరీక్షలు డాక్టర్‌తో చేయించాలని అన్నారు. సమావేశంలో ఎపిఒ చినబాబు, డిడి అన్నదొర, ఎటిడబ్ల్యుఒలు మంగవేణి, శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ దేశ్‌ముఖ్ తదితరులు పాల్గొన్నారు.

ముంచెత్తిన వాన

- పట్టణానికి తరుముకొస్తున్న ముంపు భయం
- చెరువులు, గెడ్డల ఆక్రమణలే కారణం
- చోద్యం చూస్తోన్న అధికారులు, పాలకులు

ప్రజాశక్తి - పార్వతీపురం

మన్యం జిల్లాలో మంగళవారం భారీవర్షం కురిసింది. ఏకధాటి వర్షంతో పలు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. ఒకరోజు వర్షానికే పట్టణ ప్రధాన రహదారి చెరువులా మారింది. మంగళవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేని వర్షం పడడంతో మెయిన్ రోడ్డు జలమయమైంది. రికార్డు స్థాయిలో 45.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షాకాలం ఆరంభంలోనే ఇలా వుంటే ముమ్ముందు భారీ వర్షాలకు మెయిన్ పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. సారికవీధి నుంచి దేవాంగుల వీధి వరకు, ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్ చిన్నపాటి వర్షానికే జలమయమయ్యాయి. రానున్న రోజుల్లో భారీ వర్షాలు పడితే పట్టణంలోని లోతట్టు ప్రాంతాలన్నీ జలదిగ్బంధంలో కూరుకుపోయే ప్రమాదం పొంచి ఉంది. గత కొన్నేళ్లుగా పట్టణానికి ఇదే పరిస్థితి కొనసాగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. శతాబ్దాల తరబడి పట్టణంలో ఉన్న ప్రభుత్వ చెరువులు, కాలువలు, గెడ్డలు కబ్జాకు గురి కావడంతో పడిన వర్షపునీరు బయటకు పోయే మార్గం లేక ప్రధాన రహదారి ముడుకులోతు నీటిలో మునిగివుంటోంది. గత ప్రభుత్వ హయాంలో పట్టణంలో చాలా చెరువులు, గెడ్డలు, కాలువలు ఆక్రమణకు గురయ్యాయి. మన్యం జిల్లా కేంద్రంగా పార్వతీపురం అవతరించిన తర్వాత భూకబ్జాలు, ఆక్రమణలు పెరిగాయి. పట్టణంలోని పదుల సంఖ్యలో చెరువులు ఇప్పుడు కనిపించడం లేదు. వాటి స్థానంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు నిర్మించిన అపార్ట్‌మెంట్లు కనిపిస్తున్నాయి. ప్రభుత్వ చెరువుల కబ్జాలపై జిల్లా కలెక్టర్‌కు వందల సంఖ్యలో ఫిర్యాదులు చేసినా ఫలితం కనిపించలేదు. ప్రభుత్వ చెరువుల పరిరక్షణ సమితి పోరాడుతున్నా పాలకులు, అధికారుల నుంచి కనీస స్పందన కనిపించడం లేదు. తిలా పాపం తలా పిడికెడు అన్న చందంగా పట్టణంలోని చెరువుల కబ్జాలకు పాలక పార్టీ నాయకులు, అధికారులే కారణమనేది స్పష్టంగా కనిపిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూకబ్జాలపై స్పందించాల్సిన ప్రస్తుత టిడిపి ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మౌనం వహించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత ఎన్నికల ముందు కబ్జాదారుల అంతు చూస్తానని చెప్పిన ఎమ్మెల్యే బోనెల వారికి ఊతమిచ్చేలా వ్యవహరించడంతో పట్టించుకునే నాథుడు కరువయ్యారు. కొద్దినెలల క్రితం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే బోనెల మాట్లాడుతూ పట్టణంలో భూకబ్జాలపై కమిటీ నియమించాలని కోరడం అప్పట్లో చర్చనీయాంశమైంది. కానీ ఇంతవరకు ఆయన మాట కార్యరూపం దాల్చలేదు. భూకబ్జాలపై జిల్లా అధికారులు స్పందిస్తారనే ఆశలు ఆవిరవుతున్నాయి. దీంతో రాబోయే వర్షాలకు పట్టణంలోని పలు ప్రాంతాలు ముంపునకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

ముంపునకు పాలక పార్టీలదే పాపం

పట్టణంలోని ప్రభుత్వ చెరువులు, కాలువల ఆక్రమణకు గురికావడం వల్లే ప్రధాన రహదారి ముంపునకు గురవుతోంది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూకబ్జాలపై టిడిపి ప్రభుత్వం స్పందించడం లేదు. ఒక రోజు వర్షానికే పట్టణ ప్రధాన రహదారి చెరువులా ఉంటే ముమ్ముందు భారీ వర్షాలు పడితే పరిస్థితి ఊహించలేం. కబ్జాలపై జిల్లా కలెక్టర్‌కు అనేక సార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. ప్రస్తుత పరిస్థితికి వైసిపి, టిడిపి నాయకులు చేసిన పాపాలే శాపాలుగా మారుతున్నాయి.

చెరువును తలపిస్తున్న పట్టణంలోని ప్రధాన రహదారి

పట్టణంలో భారీ వర్షం

పార్వతీపురం టౌన్ : పట్టణంలో మంగళవారం తెల్లవారు జాము నుంచి వాతావరణంలో మార్పులు ఏర్పడి ఆకాశం మేఘావృతమై ఉరుములతో కూడిన వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. మృగశిర కార్తె ప్రభావంతో నిన్నటి వరకు ఎండ వేడిమి, ఉక్కపోతతో అల్లాడిన ప్రజలకు ఒక్కసారి ఉపశయనం కలిగింది. భారీ వర్షం కురవడంతో ప్రధాన రహదారితో పాటు, పలు వార్డుల్లో ఉన్న చిన్న మురుగు కాలువల్లో వర్షపునీరు రహదారులపైనే పొంగిపొర్లడంతో రహదారిపై ప్రయాణించేందుకు వాహన చోదకులు, పాదచారులు నానా అవస్థలు పడ్డారు.

కొమరాడ: మండలంలోని మంగళవారం వేకువజాము నుంచి ముసురును వాతావరణం తలపించడంతో ఒకసారిగా వాతావరణ పూర్తిగా చల్లబడింది. ఉదయం 7 గంటల నుంచి వర్షం ప్రారంభమై సుమారు 10 గంటల వరకు ఏకధాటిగా కురవడంతో వాతావరణ పూర్తిగా చల్లబడింది. దుక్కులకు కొంతమేరకు అదును కాకపోయినాప్పటికీ మూడురోజులు పోతే దుక్కులకు అదునుగా ఉంటుందని రైతన్నలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజుల పాటు తుపాన్ నేపథ్యంలో భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున నదీ పరివాక ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు.

పాలకొండ :పట్టణంలో మంగళవారం ఉదయం ఐదు గంటల నుంచి వర్షం కురిసింది. గత నాలుగు రోజులుగా ఎండలు వేడికి ఇబ్బందులు పడుతున్న ప్రజలకు వర్షం ఊరటనిచ్చింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి.

ఇంటర్ చదువుకు దారేదీ?

- సీట్లు 600 - దరఖాస్తులు 1239
- గిరిజన విద్యార్థులకు కలగా మిగిలిన ఉన్నత విద్య
- ఇదీ మొదటి స్థానంలో నిలిచిన జిల్లా దుస్థితి

ప్రజాశక్తి - పార్వతీపురం

వరుసగా మూడు సార్లు పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రథమ స్థానంలో నిలిచిన మన్యం జిల్లాలో ఇంటర్ చదువు కోసం గిరిజన విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. ఇంటర్ ఆశావహులు అధికంగా ఉంటే అందుబాటులో ఉన్న సీట్లు తక్కువగా ఉండడంతో వారు ఆందోళన చెందుతున్నారు. గత మూడేళ్లుగా జిల్లాలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పదోతరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం ఎక్కువగా ఉంటోంది. జిల్లా అధికారులు, ఉపాధ్యాయుల కృషి ఫలితంగానో, విద్యార్థుల శ్రమ కారణంగానో పదోతరగతి ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం గణనీయంగా పెరిగింది. ఉత్తీర్ణులైన విద్యార్థుల సంఖ్య ఆధారంగా జిల్లాలోని గిరిజన గురుకుల కళాశాల్లో సీట్లు వుండాలి. కానీ ఆ విధంగా సీట్లు, విద్యార్థుల నిష్పత్తి లేదు. దీంతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. పది పాసైన తమ పిల్లలను ఎక్కడ చదివించాలో అర్థం కాక అయోమయంలో పడుతున్నారు. ప్రయివేటు, కార్పొరేట్ కళాశాలల్లో చదివించే స్థోమత లేక పిల్లల చదువు మధ్యలో నిలిపివేయలేక సతమతమవుతున్నారు.

పార్వతీపురం ఐటిడిఎ పరిధిలోని గుమ్మలక్ష్మీపురం భద్రగిరి పిటిజి బాలికలు 120, భద్రగిరి బాలురు 120, కురుపాం బాలికలు 80, పాచిపెంట మండలం పి.కోనవలస బాలురు 140, బాలికలు 140 కలిపి అన్ని గురుకుల కళాశాలల్లో మొత్తం 600 సీట్లు ఉన్నాయి. అయితే 1,239 మంది గిరిజన విద్యార్థులు దరఖాస్తు చేసుకొన్నారు. అందిన దరఖాస్తులను బట్టి చూస్తే మరో 600 సీట్లు పెంచాలి. ఇలాంటి పరిస్థితుల్లో ఏం చేయాలో తోచక గిరిజన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు జిల్లా అధికారులు, ఐటిడిఎ పిఒ చుట్టూ తిరుగుతున్నారు. అయితే 120 అదనపు సీట్లు కోసం ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీ వాత్సవ గిరిజన గురుకుల సొసైటీ అధికారులకు లేఖ రాశారు. ఒకవేళ 120 సీట్లు పెంచినా ఇంకా కొరత ఉంటుంది. గత వైసిపి ప్రభుత్వం హయాంలో 10 గిరిజన ఆశ్రమ పాఠశాలలు ఇంటర్ వరకు అప్ గ్రేడ్ చేయాలని చేసిన ప్రతి పాదనలు అమలుకు నోచుకోలేదని, దీంతో ప్రతి ఏటా గిరిజన విద్యార్థుల సీట్లు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి సొంత జిల్లాలో గిరిజన విద్యార్థులు ఇలాంటి సమస్య ఎదుర్కోవడం చర్చనీయాంశమవుతోంది .

కాలేజీ సీట్లు పెంచాలి

ఆశ్రమ పాఠశాలల మాదిరి గిరిజన గురుకుల కళాశాలల్లో సీట్లు దొరికితే ఉచిత విద్య అన్ని సౌకర్యాలతో అందుతుంది. పేద గిరిజన విద్యార్థులందరికీ గురుకుల కళాశాలల్లో చదుకొనేలా కాలేజీల సంఖ్య, సీట్లు పెంచాలి.

పి.రంజిత్ కుమార్,
గిరిజన సంక్షేమ సంఘం
ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి

పాఠశాలను కొనసాగించాలి

ప్రజాశక్తి - పాలకొండ

మండలంలోని పద్మాపురం ప్రాథమిక పాఠశాలను యథావిధిగా కొనసాగించాలని వాటపాగు సర్పంచ్ వావులపల్లి రాజారావుతో పాటు గ్రామస్తులు మంగళవారం ఎంఇఒ పి.కృష్ణమూర్తికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పద్మాపురంలో పాఠశాల ఉండడం వల్ల విద్యార్థులకు ఉపయోగకరంగా ఉండేదన్నారు. ఇక్కడున్న ఏకోపాధ్యాయురాలిని బదిలీకి పంపించడ సరికాదన్నారు. ఈ పాఠశాల మూసివేస్తే ఇతర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవడం ఇబ్బందికరంగా మారుతుందన్నారు. ఈ ప్రతిపాదన విరమించుకోవాలన్నారు.

విపత్తుల పట్ల అప్రమత్తం : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

విపత్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. నైరుతి రుతుపవనాల రాక నేపథ్యంలో భారీ వర్షాలు, వరదలు సంభవిస్తే తక్షణమే రక్షణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ విషయంలో అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని రెడ్ క్రాస్, పంచాయతీ కార్యదర్శులు, విఆర్‌ఒలు, విఇఒలు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నైరుతి రుతుపవనాల సంసిద్ధతపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో చెరువులు, కాలువలు, రిజర్వాయర్లు ఎక్కువగా ఉన్నాయని, వర్షాకాలంలో వీటివల్ల ప్రజలకు, పశు సంపదకు, పంటలకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా అప్రమత్తం చేయాల్సి ఉందన్నారు. భారీ వర్షాలు, పిడుగులు, ఉరుముల సమయంలో ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలపై వాతావరణ శాఖ హెచ్చరికలు జారీచేస్తుందని, వాటిపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. భారీ వర్షాలు, వరదల సమయంలో కాలువలు ఉన్న ప్రదేశాల వద్ద హెచ్చరిక బోర్డులను ఉంచాలని, రోడ్డుకు అడ్డుగా విరిగి పడిన చెట్లను తక్షణమే తొలగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వరదల వల్ల రిజర్వాయిర్ గేట్లు ఎత్తివేసే సమయంలో ముందు రోజే ప్రజలను, రైతులను అప్రమత్తం చేయాలని పేర్కొన్నారు. విపత్తుల పట్ల ముందస్తు ప్రణాళికలు, వనరుల లభ్యత, ఆకస్మిక ఏర్పాట్లను సమర్థవంతంగా ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. రెస్క్యూ ఆపరేషన్ల సమయంలో అవసరమైన వాటిని అధికారుల సమన్వయంతో ముందుగా సమకూర్చుకోవాలని అన్నారు. గిరిజన కొండవాలు ప్రాంతాల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలపై ప్రజలకు అవగాహన కల్పించి, సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అన్నారు. సమావేశంలో జెసి ఎస్.ఎస్.శోబిక, డిఆర్‌ఒ కె.హేమలత, డ్వామా, డిఆర్డిఎ, ఐసిడిఎస్ పీడీలు కె.రామచంద్రరావు, ఎం.సుధారాణి, డాక్టర్ టి.కనకదుర్గ, పలుశాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

శంకరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు

ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి కనిపించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో పిఎం సూర్యఘర్ గ్రౌండింగ్ వేగవంతం కావాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఎపిఇపిడిసిఎల్ ఎడిలను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత కార్యక్రమమైన సూర్యఘర్ పథకం పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రతి రోజూ ప్రగతి ఉండాలని, ఇందుకు గ్రామ, మండల, వార్డు స్థాయిలో శిబిరాలను నిర్వహించేలా ప్రణాళికను సిద్ధం చేయాలని అన్నారు. శిబిరాల వద్ద డెమో చేసి చూపించాలని, అక్కడే రిజిస్ట్రేషన్లు, బ్యాంకు రుణాలు మంజూరు చేయడమే కాకుండా గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇప్పటికే రుణాలు మంజూరైనప్పటికీ కొన్ని చోట్ల గ్రౌండింగ్ కాలేదని, అటువంటి వాటిపై ప్రత్యేక దష్టి సారించాలని అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పీఎం సూర్యఘర్, పీఎం జన్ మన్ గహ నిర్మాణాల పురోగతి, పీఎం జుగాపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపడుతున్న పీఎం జన్ మన్ గహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని హౌసింగ్ ఎఇను కలెక్టర్ ఆదేశించారు. ప్రధానమంత్రి జనజాతీయ ఉన్నతి గ్రామ అభియాన్ (పీఎం జుగా) పథకంపై జూన్ 15 నుంచి 30 వరకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఐటిడిఎ ఎపిడి ఎ.మురళీధర్, వెలుగు ఎపిడి వై.సత్యంనాయుడు, పార్వతీపురం, పాలకొండ మునిసిపల్ కమిషనర్లు సిహెచ్.వెంకటేశ్వర్లు, ఎస్‌జెవి రతన్ రాజు, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వనకాబడి చేసుకున్న పాపమేమిటి?: సిపిఎం

ప్రజాశక్తి - కురుపాం

గుమ్మలక్ష్మీపురం మండలం వనకాబడికి ఇంత వరకూ రోడ్డు లేకపోవడానికి వనకాబడి చేసుకున్న పాపమేమిటని సిపిఎం జిల్లా కొల్లి గంగునాయుడు ప్రశ్నించారు. సిపిఎం నాయకులు కిల్లక శంకర్రావు నాలుగో వర్ధంతి సందర్భంగా వనకాబడి, వెల్లి దేరువాడ నుంచి వనకాబడికి వెళ్లిన రోడ్డు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2006లో వనకాబడి కొండ చరియలుపడి ఇళ్లు నేలమట్టమై 11 మంది చనిపోయారని, ఆ తర్వాత గిరిజనులు కొత్తగా గ్రామం నిర్మించుకున్నారని, అయినా ఇంత వరకూ రోడ్డు వేయలేదని అన్నారు రూ.2.70 లక్షలు నిధులు మంజూరైనా పని ప్రారంభించిన తర్వాత ఫారెస్ట్ వారు అభ్యంతరం తెలిపారని, దీంతో రోడ్డు పనులు నిలిచిపోయాయని అన్నారు. ఫారెస్ట్ క్లీరెన్స్ ఇప్పించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలని డిమాండ్ చేశారు. వనకాబడికి రోడ్డు లేకపోవడం వల్ల అటవీ ఉత్పత్తులు అమ్ముకోడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే గర్భిణులను సుమారు ఐదు కిలోమీటర్లు కొండ ఎక్కి దిగాలని అన్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే చొరవ చేసి ఫారెస్ట్ క్లీయరన్స్ ఇప్పించాలని కోరారు.

శంకర్రావు ఆశయ సాధనకు కృషి చేయాలి

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని వనకాబడిలో సిపిఎం నాయుకులు, మాజీ సర్పంచ్ కిల్లక శంకర్రావు నాలుగో వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు శంకర్రావు స్థూపం వద్ద నివాళులు అర్పించారు. గిరిజనల హక్కుల కోసం సిపిఎం పక్షాన ఉంటూ ఎన్నో పోరాటాలు చేశారని సందర్భంగా గుర్తు చేశారు. గిరిజనులకు విద్య, వైద్యం అందించడం లేదని జిఒ 3ను ఎత్తివేసి, ఉపాధి లేకుండా చేస్తున్నారని, అటవీ హక్కుల చట్టాన్ని నీరుగార్చి కొండలన్నీ గనులు పేరుతో కార్పొరేట్ పెట్టుబడిదారులకు అప్పుజెప్పడానికి చూస్తున్నారని అన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం శంకర్రావు పోరాడారని, ఆయన ఆశయసాధనకు పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయుకులు ఎం.శ్రీనివాస రావు, పి.తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

తమ సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు డిమాండ్ చేస్తూ వివిధ మున్సిపాలిటీల్లో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న సమ్మె నివారణకు, సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ డిమాండ్ చేశారు. మంగళవారం మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేస్తున్న సమ్మె శిబిరంలో ఆయన పాల్గొని కార్మికుల పోరాటానికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేస్తున్న పనికి తగిన వేతనం పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక ఏళ్లుగా వివిధ రంగాల కార్మికులకు జీతాలు పెరుగుతున్నప్పటికీ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న వాటర్ వర్క్స్, ఎలక్ట్రీషియన్స్ వంటి నైపుణ్యం కలిగిన కార్మికులకు జీతాలు పెంచకపోవడం దుర్మార్గమని విమర్శించారు. 15ఏళ్ల సర్వీస్ పూర్తిచేసిన కార్మికులందర్నీ రెగ్యులర్ చేయాలని, ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని డిమాండ్ చేశారు. రెగ్యులర్ చేసేంత వరకు హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. తక్షణమే మున్సిపల్ అధికారులు స్పందించి ఆందోళనలు, సమ్మె నిర్వహిస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మిక నాయకులతో చర్చలు జరిపి సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిచో వివిధ రంగాల కార్మికులందర్నీ ఐక్యం చేసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వినయ్‌కుమార్, బాబురావు, గణపతి, చిన్నికృష్ణ, ఉమా తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఇంజినీరింగ్ కార్మికులు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులు

సాలూరు : రాష్ట్రంలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు జీతాలు పెంచాలని, సంక్షేమ పథకాలు వీరి కుటుంబాలకు అమలు చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్ వై నాయుడు డిమాండ్ చేశారు. పట్టణంలో ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులతో కలిసి ప్రచార కరపత్రాన్ని మంగళవారం విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మున్సిపల్ రంగంలో పారిశుధ్య కార్మికుల జీతాలు పెంచి ఇంజనీరింగ్ కార్మికులకు పెంచకుండా పాలకవర్గాలు ద్రోహం చేశాయని, అధికారం ఇస్తే ఇంజనీరింగ్ కార్మికుల జీతాలు పెంచుతామని కూటమి ప్రభుత్వం మాట ఇచ్చి నేటికి ఏడాదైనా చర్చల పేరిట జాప్యం చేస్తుందని విమర్శించారు. అందుకే రాష్ట్రవ్యాప్తంగా ఇంజినీరింగ్ కార్మికులు పాలకవర్గాలకు, అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు ఇస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం స్పందించకుంటే ప్రజల మద్దతుతో భవిష్యత్తులో సమ్మె చేపట్టేందుకు వెనుకాడమని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు డి.సంతోష్ కుమార్, శ్యామ్, కాశీనాయుడు, ఈశ్వరరావు, శ్రీను, బాబూరావు పాల్గొన్నారు.

బాబు పాలనలో మహిళలకు భద్రత కరువు

వైసిపి మహిళా విభాగం నిరసన

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలంలో మహిళలపై అఘాయిత్యాలు, అత్యాచారాలు, హత్యాలు అరికట్టడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని, దీనికి నిరసనగా వైసిపి మహిళా విభాగం ఇచ్చిన పిలుపునందుకుని మంగళవారం జిల్లా వైసిపి మహిళా విభాగం ఆధ్వర్యంలో పట్టణ ప్రధాన రహదారి గుండా ఇందిరా కాలనీ వద్ద బాబా సాహెబ్ అంబేద్కర్ సర్కిల్ వరకు మహిళలంతా కలిసి నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మహిళలపై దాడులు ఆపాలని కోరుతూ రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహానికి పూలు మాలలు వేసి వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా మహిళా విభాగం అధ్యక్షులు రెడ్డి పద్మావతి మాట్లాడుతూ ఏడాది కాలంగా కూటమి ప్రభుత్వం పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా మహిళలు, చిన్నపిల్లలపై దాడులు, అఘాయిత్యాలు రోజురోజుకు పెచ్చురిల్లిపోతున్నాయని, వాటిని అరికట్టడంలో బాబు ప్రభుత్వం, పోలీస్ అధికారులు ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు గాలికి వదిలేశారని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, హోంమంత్రి అనిత మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలకు అడ్డుకట్ట వేయాలని, చిన్నపిల్లలకు, మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. పరిస్థితులు ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో మహిళా ఉద్యమాలు, నిరసన కార్యక్రమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ ర్యాలీలో మున్సిపల్ చైర్పపర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్మన్ కొండపల్లి రుక్మిణి, ఎపిపి మజ్జి శోభారాణి, నియోజకవర్గం మహిళా విభాగం అధ్యక్షులు దాసరి నాగరత్నం, కురుపాం ఎంపిపి శెట్టి పద్మావతి, జడ్పీటీసీ గొర్ల సుజాత, జియమ్మవలస జడ్పీటీసీ శశికళ, వీరఘట్టం వైస్ ఎంపిపి విజయకుమారి, నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు - జడ్పీటీసీ జంపు కన్నతల్లి, స్టేట్ ఎస్సీ సెల్ కార్యదర్శి గండి భాగ్యవతి, కౌన్సిలర్ సభ్యులు లావణ్య, అనురాధ, లక్ష్మి పార్వతి, ఇతర మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం నిరసన తెలుపుతున్న వైసిపి మహిళా విభాగం నాయకులు

ఎంఎల్ఎస్ పాయింట్ తనిఖీ

ప్రజాశక్తి - పార్వతీపురం

పాఠశాలలకు పక్కాగా బియ్యం సరఫరా చేయాలని పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ ఆదేశించారు. పార్వతీపురం ఎంఎల్ఎస్ పాయింట్‌ను సబ్ కలెక్టర్ మంగళవారం తనిఖీ చేశారు. ఎంఎల్ఎస్ గిడ్డంగిలో బియ్యం నిల్వలను పరిశీలించారు. రిజిస్టర్లను తనిఖీ చేశారు. పాఠశాలలకు రవాణా చేస్తున్న బియ్యం రవాణా వివరాలు అడిగి తెలుసుకున్నారు. రెండు రోజుల్లో విద్యా సంస్థలు, వసతి గృహాలు ప్రారంభం కానున్న దృష్ట్యా పంపిణీ వేగవంతం చేయాలని పేర్కొన్నారు. ఎక్కడా రవాణా ఇబ్బందులు ఎదురు కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పర్యవేక్షణ పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు. అన్ని పాఠశాలలు, వసతి గృహాల్లో పంపిణీ పూర్తి చేసిన నివేదికను సమర్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ జయలక్ష్మి, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

రాయితీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి -కురుపాం

ప్రభుత్వం అందిస్తున్న రాయితీ విత్తనాలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి అన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కురుపాంలో గల రైతు సేవా కేంద్రంలో విత్తనాలు పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విత్తనాలు అందనటు వంటి రైతులు ఎవరైనా ఉంటే వెంటనే వారు వ్యవసాయ శాఖ సిబ్బందికి సంప్రదించి విత్తనాలు తీసుకోవాలని రైతులు విత్తనాల కోసం ఇబ్బందులు పడకుండా ఉండేందుకే కూటమి ప్రభుత్వం ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే విత్తనాలు రైతులకు అందజేయడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ కెవి కొండయ్య, ఎఒలు కె.నాగేశ్వరరావు, పి.శంకర్రావు, రైతులు పాల్గొన్నారు.

ఎస్‌సి వర్గీకరణ అమలు చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

ఐటిడిఎ పరిధిలోని ఉపాధ్యాయుల ప్రమోషన్లలో ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్ రావు కోరారు. స్కూల్ అసిస్టెంట్లు, హెచ్ఎం ప్రమోషన్ ల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రమోషన్ల కోసం 200 రోస్టర్ సైకిల్ ఎస్సీలకు అమలు చేయాలని కోరారు. అడెక్వసీ అమలు చేయాలని, నిబంధ నలకు అనుగుణంగా ప్రమోషన్లు కల్పించాలని ఐటిడిఎ పిఒను కోరారు.

ఘనంగా బాలకృష్ణ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ప్రముఖ సినీ హీరో, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకష్ణ 65వ పుట్టిన రోజులు వేడుకలను మంగళవారం స్థానిక మద్దాలవారివీధిలో (బొగ్గులవీధి) సీనియర్ నందమూరి అభిమానులు గొర్లి వెంకటరమణ, ముట్నూరు వెంకటరమణ, చెవిటి వెంకట రమణ, కెంగువ వెంకటరమణ, పాకల సన్యాసిరావు, హనుమంతు రాము, శిరేల శ్రీను ఆధ్వర్యంలో జరిగాయి. ముందుగా పిల్లలు, యువత, పెద్దల సమక్షంలో కేక్ కట్ చేశారు. అనంతరం అందరికీ స్వీట్లు పంపిణీ చేవారు. ఈ కార్యక్రమంలో అభిమానులు పాల్గొన్నారు..

వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌పై అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెద్దగొత్తిలి, వలసబల్లేరు, లంకజోడు గిరిజన గ్రామాల్లో మంగళవారం కృషి విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ ఎస్. ధ్రువ, శాస్త్రవేత్తలు ప్రభుత్వం అందించే పథకాలు, వరి, అపరాల్లో పురుగులు, తెగుళ్ల యాజమాన్యం, డ్రోన్ టెక్నాలజీ, వరి, మొక్క జొన్న యాజమాన్య పద్ధతులు, నవధాన్యాలు, ప్రకృతి వ్యవసాయం, జీవన ఎరువులు, సమగ్ర యాజమాన్య పద్ధతులు, జీడి, ఆయిల్ పాం పంటల గురించి పచ్చిరొట్ట పంటల పండించే విధానంపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి గిరిజ, కెవికె శాస్త్రవేత్తలు అనంత విహారి, అమృతవీణ , పూర్ణ బిందు, శ్రీనివాస్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

'కిశోర వికాసం' బంగారు భవిష్యత్తుకు పునాది

ప్రజాశక్తి - గరుగుబిల్లి

కిశోర వికాసం బాలికల బంగారు భవిష్యత్తుకు పునాదని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రౌతు లక్ష్మి అన్నారు. కిశోర వికాసం కార్యక్రమంపై మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఈ కార్యక్రమం ఆవశ్యకతను వివరించారు. 11 ఏళ్ల నుంచి 18 ఏళ్ల బాలికలకు విద్య, ఆరోగ్యం భద్రత ఆర్థిక స్వావలంబనను మెరుగుపర్చడమే ఈకార్యక్రమం ముఖ్యోద్దేశమన్నారు. రక్తహీనత నివారణే ధ్యేయంగా గర్భిణీలు, బాలింతలకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో గరుగుబిల్లి సచివాలయం మహిళా సంరక్షణ అధికారి గొర్లి భవాని, ఎఎన్ఎం బోను శ్రీదేవి, అంగన్వాడీ వర్కర్లు పల్లా కృష్ణవేణి, మహంతి పద్మావతి, మూడడ్ల స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలల సమస్యలపై మంత్రి లోకేష్‌కు వినతి

ప్రజాశక్తి - కురుపాం

మంత్రి లోకేష్‌కు సమస్యను వివరిస్తున్న లావణ్య

మన్యం జిల్లా పర్యటనకు విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ సోమవారం వచ్చిన సందర్భంగా ఎపి రాష్ట్ర ట్రైకర్ బోర్డు డైరెక్టర్ పువ్వల లావణ్య కలిసి గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలల సమస్యలపై వినతి అందించినట్టు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో నీలకంఠాపురంలో గల గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలకు రూ.4కోట్లుతో నిర్మించిన పాఠశాల భవనానికి విద్యుత్తు మోటారు, మరుగుదొడ్ల కనీస మౌలిక వసతుల్లేవని, అలాగే ధర్మలక్ష్మీపురంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు ప్రహరీగోడ పైకప్పు పెచ్చులు ఊడి వర్షానికి కారణం జరుగుతుందని, దీంతో గిరిజన విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటారని అన్నారు. కావున సమస్యలు పరిష్కరించి గిరిజన విద్యార్థులను ఆదుకోవాలని వినతి అందించానని, దీనికి ఆయన సానుకూలంగా స్పందించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ఆలయ భూముల కౌలు వేలం

మక్కువ : మండలంలోని డి.శిర్లాంలో గల సంగమేశ్వరస్వామి ఆలయానికి చెందిన భూములు సర్వే నంబరు 230/6:లో ఏ,, 2.66 సెంట్లుకు, సర్వే నెంబరు 388/1లో 5 ఎకరాల మెట్టు భూములకు మూడేళ్లు కౌలుకు ఇచ్చేందుకు మంగళవారం టెండర్ కం బహిరంగ వేలం పాటలు దేవాదాయశాఖ ఉన్నతాధికారి ఎం.ప్రసాదరావు ఆధ్వర్యంలో నిర్వహించినట్టు ఇఒ వివి సూర్యనారాయణ తెలిపారు. ఈ వేలంపాటలో 2.66 సెంట్లు మెట్టు భూమికి ఏడాదికి ఒక్కంటికి రూ.11500, ఐదెకరాల మెట్టుభూమికి ఏడాది ఒక్కొంటికి రూ.24,100 చొప్పున కౌలుకు వేలంపాటదారులు దక్కించుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి కోటేశ్వరరావు, ఎంపిటిసి సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి

పాలకొండ : 2018లో క్రైస్తవులకు శ్మశాన వాటికకు స్థలాన్ని కేటాయించగా, ఆ భూమిని ఇక్కడ ఉన్న వైసీపీ నాయకులు ఆక్రమించుకున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త సబ్బ నానాజీ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు ఫిర్యాదు చేశారు. సర్వే 479లో స్థలంగా ఉన్న ఈ భూమిని ఆక్రమించుకున్నారన్నారు. టిడిపి అధికారానికి వచ్చాక ఫిర్యాదు చేసినా రెవెన్యూ అధికారులు పట్టించు కోవడం లేదన్నారు, ఐఎఎస్ అధికారులతో దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు

శ్రీచైతన్య స్కూల్ వద్ద నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

'శ్రీచైతన్య'లో పుస్తకాల అమ్మకం ఆపాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - పార్వతీపురం

విద్యాహక్కు చట్టాన్ని తుంగలో తొక్కేలా పార్వతీపురంలోని పలు కార్పొరేట్, ప్రైవేట్ స్కూల్స్ నిలిచాయని, విచ్చలవిడిగా పుస్తకాల వ్యాపారం చేపడుతున్నాయని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు టి.అఖిల్ అన్నారు. మంగళవారం స్థానిక శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో యాజమాన్యం పుస్తకాల విక్రయాలు చేపడుతుండడంతో ఎస్ఎఫ్ఐ నాయకులు అడ్డుకున్నారు. వెంటనే జిల్లా విద్యాశాఖ అధికారులకు సమాచారం తెలిపినప్పటికీ స్పందించకపోవడంతో పుస్తకాలతో స్కూల్ బయట బైఠాయించారు. ఈ సందర్భంగా అఖిల్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభానికి మునుపే కార్పొరేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు విద్యారంగాన్ని వ్యాపారంగంగా మలుచుకొనే ప్రయత్నాలు చేపడుతున్నాయని, ఇది దుర్మార్గమని మండిపడ్డారు. నాణ్యమైన విద్య పేరుతో యాజమాన్యాలు వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్నాయని, తల్లిదండ్రుల రక్తాన్ని జెలగల్లా పట్టిపీడిస్తున్నారని ఆరోపించారు. విద్యార్థులకు సెలవులు ఇవ్వకుండా తరగతులు నిర్వహించడం దారుణమన్నారు. యాజమాన్యం పుస్తకాలు, యూనిఫాం పేరుతో రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు అదనంగా వసూలు చేస్తున్నారని తెలిపారు. వీటిపై స్పందించాలని జిల్లా, మండల విద్యాశాఖ అధికారులకు సమాచారం తెలిపినప్పటికీ పట్టించకపోవడం అన్యాయమని అన్నారు. గతంలో పలు విద్యాసంస్థలు పాఠ్య పుస్తకాలు విక్రయాలు చేపడుతున్నాయని సమాచారం తెలిపినా ఎటువంటి స్పందన లేదని, అదే తీరు శ్రీ చైతన్య స్కూల్‌పై కూడా విద్యాశాఖ అధికారులు అవలంబిస్తున్నారని, ఇది ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసే కుట్రలో భాగమేనని అన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దందా వెనుక జిల్లా విద్యాశాఖ అధికారుల ప్రమేయం ఉన్నట్టు స్పష్టంగా అర్థమవుతుందని, వెంటనే కలెక్టర్ స్పందించి వీరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యా హక్కు చట్టానికి వ్యతిరేకంగా పుస్తకాలు, యూనిఫాంలు అమ్మకాలు చేపడుతున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పార్వతీపురం పట్టణ కమిటీ సభ్యులు అనిల్, గంగారాం పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు గౌరునాయుడు, స్వామినాయుడు

పాలస్తీనా ముఖచిత్రం పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

పాలస్తీనాపై అమెరికన్ సామ్రాజ్యవాదం అండతో ఇజ్రాయిల్ చేస్తున్న దాడుల గురించి మానవ కోణం నుంచి ఆలోచింపజేసే పాలిస్తీన ముఖచిత్రం పుస్తకం మంగళవారం ఆవిష్కరణ జరిగింది. రైతు కూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) ప్రచురించిన పాలస్తీనా ముఖచిత్రం ఆవిష్కరణ సభ రైతు కూలీ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పి.శ్రీనునాయుడు అధ్యక్షతన మంగళవారం స్థానిక ఎపి ఎన్జీవో భవన్లో జరిగిన కార్యక్రమంలో ఈ పుస్తకాన్ని ప్రముఖ కవి, రచయిత గంటేడ గౌరు నాయుడు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇలాంటి పుస్తకం తీసుకురావడం అభినందనీయమని, అత్యంత క్రూరంగా పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను శాంతిని కోరుకునే ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి దంతులూరి వర్మ మాట్లాడుతూ పాలస్తీనా భూభాగం అరబ్ దేశాలను గుప్పిట్లో పెట్టుకోవడానికి వ్యూహాత్మక కేంద్రంగా ఉండడంతో సామ్రాజ్యవాదం ఆ దేశాన్ని నిత్యం యుద్ధాలకు గురి చేస్తుందని, అలాగే ఆ ప్రాంత ఆయిల్ వనరుల కోసం ఒక జాతిని నాశనం చేయడానికి కూడా వెనుకాడడం లేదని అన్నారు. మనదేశంలోనూ సహజ వనరులను దోచుకోవడం కోసం సామ్రాజ్యవాదం అనేక ప్రయత్నాలు చేస్తుందని, కావున దేశ ప్రజానీకం అప్రమత్తంగా ఉండి పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రముఖ కవి సిరికి స్వామినాయుడు రాసిన కవితను చదివి వినిపించారు. సీనియర్ న్యాయవాది జోగారావు గారు, తదితరులు పాల్గొన్నారు. వివిధ గ్రామాల నుంచి ప్రజలు పాల్గొన్నారు.

ఎంఇఒల సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి దామోదరరావు

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

ప్రజాశక్తి - పార్వతీపురం

విద్యతోనే పిల్లలకు ఉజ్వల భవిష్యత్ సాధ్యమౌతుందని రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు అన్నారు. మంగళవారం జిల్లా కోర్టు ఆవరణలో నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (నల్సా) ఆధ్వర్యంలో లీగల్ సర్వీసెస్ చైల్డ్ ఫ్రెండ్లీ స్కీంలో భాగంగా ఎంఇఒలతో సమావేశం నిర్వహించారు. పార్వతీపురం, గరుగుబిల్లి, జియ్యమ్మవలస, కొమరాడ ఎంఇఒలతో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో చదువు పట్ల ఆసక్తి, ఉత్సాహం కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. బడికి రాని బడి ఈడు పిల్లల తల్లిదండ్రులతో సంప్రదించి వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. ఆర్థిక పరిస్థితుల వల్ల చదువును మధ్యలో ఆపేసిన పిల్లలకు మళ్లీ చదువుకొనేలా వారిలో అవగాహనా కలిగించాలని పేర్కొన్నారు. చదువుకునే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని జడ్జి తెలిపారు. మధ్యాహ్న భోజన పథకంలో మెనూను పాటించాలని, వారికి పౌష్టికాహారం అందించాలని జడ్జి అన్నారు. చదువుకు జాతి, లింగం, భాష, మతంతో సంబంధం లేకుండా పిల్లలు శారీరకంగా, మానసికంగా, నైతికంగా, ఆధ్యాత్మికంగా, సామాజికంగా ఆరోగ్యకరమైన పరిస్థితులలో పెరగాలని సూచించారు. విద్యతో పాటు ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాల కొరకు కొంత సమయాన్ని విద్యార్థుల కోసం కేటాయించాలన్నారు. అప్పుడే వారికి చదువు పట్ల ఆసక్తి పెరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు టి.జోగారావు, బి.సత్యనారాయణ, ఎజిపి,అడ్వకేట్ యం.వెంకటరమణ, పిఎల్వీలు, నల్సా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి కనిపించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో పిఎం సూర్యఘర్ గ్రౌండింగ్ వేగవంతం కావాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఎపిఇపిడిసిఎల్ ఎడిలను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత కార్యక్రమమైన సూర్యఘర్ పథకం పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రతి రోజూ ప్రగతి ఉండాలని, ఇందుకు గ్రామ, మండల, వార్డు స్థాయిలో శిబిరాలను నిర్వహించేలా ప్రణాళికను సిద్ధం చేయాలని అన్నారు. శిబిరాల వద్ద డెమో చేసి చూపించాలని, అక్కడే రిజిస్ట్రేషన్లు, బ్యాంకు రుణాలు మంజూరు చేయడమే కాకుండా గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇప్పటికే రుణాలు మంజూరైనపట్టకీ కొన్ని చోట్ల గ్రౌండింగ్ కాలేదని, అటువంటి వాటిపై ప్రత్యేక దష్టి సారించాలని అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పీఎం సూర్యఘర్, పీఎం జన్ మన్ గహ నిర్మాణాల పురోగతి, పీఎం జుగాపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపడుతున్న పీఎం జన్ మన్ గహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని హౌసింగ్ ఎఇను కలెక్టర్ ఆదేశించారు. ప్రధానమంత్రి జనజాతీయ ఉన్నతి గ్రామ అభియాన్ (పీఎం జుగా) పథకంపై జూన్ 15 నుంచి 30 వరకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఐటిడిఎ ఎపిడి ఎ.మురళీధర్, వెలుగు ఎపిడి వై.సత్యంనాయుడు, పార్వతీపురం, పాలకొండ మునిసిపల్ కమిషనర్లు సిహెచ్.వెంకటేశ్వర్లు, ఎస్‌జెవి రతన్ రాజు, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - వీరఘట్టం

జులై 9న తలపెట్టిన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాలా రమణారావు శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ వి.ఇందిర సిఐటియు మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర క్యాబినెట్ ఆమోదించిన పది గంటల పని విధానాన్ని ఉపసంహరించుకోవాలని, నిర్బంధపు ఓవర్ డ్యూటీ చేయించడానికి మానుకోవాలని, భద్రత లేని రోజుల్లో శ్రామిక మహిళలచే పనిచేయడం ఆపాలని, ఏ రంగంలో పనిచేసే కార్మికునికైనా కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, అసంఘటితరం కార్మికులకు సమగ్ర శాసన చట్టం చేయాలని, స్కీం వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ దేశవ్యాప్తంగా తలపెట్టిన సమ్మెలో కార్మికులు, ఉద్యోగులు, స్కీం వర్కర్లు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు వై.ప్రసాదు, ఎన్.ప్రసాద్, పి.ప్రసాద్, సిహెచ్ భాగ్యలక్ష్మి, వి.వెంకటమ్మ, డి.వీరయ్య, బి.చిన్నోడు తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : జులై 9న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. కొమరాడలో సిఐటియు ఆధ్వర్యంలో ప్రజా సంఘాలు సమ్మె సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబమూర్తి, అంగన్వాడీ అండ్ హెల్పర్ కొమరాడ ప్రాజెక్టు నాయకులు సిరికి అనురాధ, మధ్యాహ్న భోజన నాయకులు సునీత మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. రాజకీయ వేధింపులు ఆపాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటుపరం ఆపాలని కోరుతూ జూలై 9న కొమరాడలో దేశవ్యాప్త సమ్మె నేపథ్యంలో అన్ని రంగాల కార్మికులు, వ్యవసాయ కూలీలు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

మంత్రి లోకేష్ దృష్టికి జంఝావతి సమస్య

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జంఝావతి సమస్యను ఐదు దశాబ్దాలుగా పూర్తికాని రాష్ట్ర మంత్రి నారా లోకేష్ దృష్టికి జంఝావతి సాధన సమితి తీసుకువెళ్ళిందని జంఝవతి సాధనా సమితి నాయకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం రాష్ట్ర మంత్రి జిల్లా పర్యటనలో భాగంగా జంఝావతి ప్రాజెక్ట్ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేసినట్లు సాధన సమితి కార్యచరణ కన్వీనర్ మరిశర్ల మాతీకృష్ణమూర్తి నాయుడు తెలిపారు. అలాగే రాష్ట్రంలో కబ్జాకు గురవుతున్న చెరువులను రక్షించేలా చర్యలు చేపట్టాలని కోరినట్లు తెలిపారు. ఒడిశా ప్రభుత్వంతో ఉన్న అడ్డంకులను బూచిగా చూపించి గత ఐదు దశాబ్దాలు పెండింగ్‌లో ఉన్న జంఝావతి ప్రాజెక్టు నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేసి ఆయకట్టు రైతులను ఆదుకోవాలని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో జంఝావతి సాధన సమితి తరపున మంత్రి లోకేష్‌ను కోరినట్లు తెలిపారు. కేంద్రంలోనూ, ఒడిశాలోను, ఆంధ్రప్రదేశ్లో కూటమి ప్రభుత్వాలే అధికారంలో ఉండడం వల్ల జంఝావతి ప్రాజెక్టు పూర్తికి ప్రస్తుత సమయం అత్యంత అనుకూలమైందిగా మంత్రి దృష్టికి తీసుకు వెళ్లినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ పార్టీ కార్యక్రమంలో కూడా జంఝావతి ప్రాజెక్టు చర్చకు వచ్చిందని తెలియజేశామన్నారు. కార్యక్రమంలో జంఝావతి సాధన సమితి చుక్క భాస్కరరావు, జాగారపు ఈశ్వర ప్రసాద్, అల్లు సత్యం, జగన్నాథ్ ప్రసాద్ రాయగురు, చుక్క చంద్రావు, వారణాసి శ్రీహరి, సెల్లారపు వెంకట నాయుడు, భారతానంద స్వామీజీ, పల్లె తేజలక్ష్మి, దయామణి, తీళ్ల గౌరీశంకరరావు, మేసిశెట్టి రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారన్నారు.

ఏజెన్సీలో పోలీసు తనిఖీలు

ప్రజాశక్తి - సీతంపేట

ఇటీవల మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌కు నిరసనగా మంగళవారం భారత్‌బంద్ పిలుపునిచ్చారు. దానిలో భాగంగా సరిహద్దుల్లోని ఏజెన్సీలో పోలీసులు ముమ్మరంగా పహారా చేస్తూ తనిఖీలు చేపట్టారు. ప్రతి వాహనం క్షుణంగా పరిశీలించారు .వాహనాల ధ్రువపత్రాలు పరిశీలించారు. ఎక్కడ నుంచి ఎక్కడికి వెళ్తుందో ఆరా తీశారు.

యోగాతో మానసిక ఒత్తిడి దూరం

ప్రజాశక్తి - కురుపాం

యోగాతో మానసిక ఒత్తిడి దూరమవుతుందని, కావున ప్రతి ఒక్కరు యోగాను అలవర్చుకోవాలని స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మంగళవారం కురుపాంలో ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని యోగా చేశారు. అనంతరం మండలపరిషత్ కార్యాలయం వరకు యోగాంధ్ర ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శారీరక, మానసిక, ఆధ్యాత్మిక శ్రేయస్సును సమతుల్యం చేయడానికి యోగా దోహదపడుతుందన్నారు. ఇది కేవలం వ్యాయామం మాత్రమే కాదని శారీరక ధృఢత్వం ప్రశాంతత, మనశ్శాంతిని అందించడంలో సహాయపడుతుందని అన్నారు. కావున ప్రతి ఒక్కరూ యోగాను ప్రతిరోజు చేయాలని కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.రవణమ్మ, ఎంఇఒ ఎన్.సత్యనారాయణ, వైద్య అధికారి బి.ప్రజ్ఞ, సచివాలయ, ఐసిడిఎస్, వైద్యసిబ్బంది, ఆశాకార్యకర్తలు యోగా శిక్షకులు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, ఎండియు వాహనదారులు

ఎండియు వాహనాల ద్వారానే రేషన్ పంపిణీ చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - సీతానగరం

ఎండియు వ్యవస్థ రద్దు నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, దీంతో పాటు రేషన్ షాపుల వద్ద సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రెడ్డి వేణు డిమాండ్ చేశారు. నిర్వహణ లోపాలు సరిదిద్ది, ఎండియు వ్యవస్థను మరింత మెరుగుపర్చాలని, అవినీతికి తావు లేకుండా ఆధునిక సాంకేతికతో అనుసంధానం చేయాలని కోరుతూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఎండియు ఆధ్వర్యాన మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ ఎండియు వ్యవస్థ ద్వారా ప్రజలకు ఇంటి వద్ద బియ్యం అందించడం ఎంతో సౌకర్యంగా ఉందని, కూలీ పనులకు వెళ్లిన పేదలకు తర్వాత రేషన్ డిపో వద్ద సరుకులు తీసుకునేలా ఏర్పాటు ఉండాలి తప్ప మొత్తం వ్యవస్థనే రద్దు చేయడం ప్రజలను ఇక్కట్లు పాలు చేస్తుందన్నారు. ఈ వాహనాల ద్వారా అక్రమ రవాణా జరుగుతుందనే నెపంతో ప్రజలకు ఇంటి వద్ద బియ్యం అందించకుండా డిపోల వద్దే తెచ్చుకోమనడం సరైంది కాదన్నారు. ఎండియు వాహనాల ద్వారా అక్రమ రవాణా జరగకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, నాణ్యమైన సన్నబియ్యం ప్రజలకు అందించాలని అన్నారు. నగదు బదిలీప్రవేశపెట్టడమంటే ప్రజా పంపిణీ (రేషన్)వ్యవస్థను ప్రజల నుంచి దూరం చేయడమేనన్నారు. అంతిమంగా పేదలు నష్టపోతారని, కాబట్టి రేషన్ సరుకులు బదులు నగదు ఇచ్చే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు, కమిటీ సభ్యులు గవర వెంకటరమణ బి.అప్పారావు, ఆర్.రాము, ఎండియు వాహనదారులు మూడడ్ల సింహాచలం, తేలు రాఘవ, పెదిరెడ్ల తిరుపతిరావు, పోలిరాజు పాల్గొన్నారు.

పిహెచ్‌సిని పరిశీలించిన సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - పాచిపెంట

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మంగళవారం సిపిఎం, ప్రజాసంఘాలు ఆస్పత్రిని, రోగులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు, మండల నాయకులు మంచాల శ్రీనివాసరావు, తామల చిన్నారావు, గిరిజన సంఘం నాయకులు కాదల రామయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ స్థానిక పిహెచ్‌సిలో పూర్తిస్థాయిలో వైద్యం అందించాలంటే 30 పడకలు ఆసుపత్రి నిర్మాణం చేపట్టాలన్నారు. ముఖ్యంగా రక్త పరీక్షలు నిర్వహించే సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని, ఐటిడిఎ పరిధిలో రక్తపరీక్షలు నిర్వహించేందుకు మరో ఇద్దర్ని నియమించాలన్నారు. సిబ్బంది కొరత వల్ల ఉన్న పని ఒత్తిడి తీవ్రంగా ఉందని తక్షణమే సిబ్బందిని నియమించాలని కోరారు. ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో కల్పించాలని, మినీ గురుకులం, కస్తూరిబాయి ఆశ్రమ పాఠశాల, బాలికల ఆశ్రమం పాఠశాలల్లో గల విద్యార్థులకు జ్వరాలు వస్తే పాచిపెంట తీసుకురావడం వల్ల ఆసుపత్రిలో పడకలు చాలక ఒకే బెడ్ మీద ఇద్దరు, ముగ్గురు విద్యార్థులకు వైద్యం అందిస్తున్న పరిస్థితి ఉందన్నారు. అలాగే రోగులకు కూడా ఇదే పరిస్థితి ఉందన్నారు. కావున 30 పడకల ఆసుపత్రి నిర్మాణం చేపట్టేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, రక్త పరీక్షలకు సంబంధించి మరో ఇద్దర్ని నియమించాలని కోరారు.

రోగులను పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు

మృతి చెందిన సోమమ్మ

ఆటో బోల్తాపడి మహిళ మృతి

ప్రజాశక్తి - పాచిపెంట

ఆటో బోల్తా పడి గిరిజన మహిళ మృతి చెందిన సంఘటన మంగళవారం మండలంలోని చీపురువలస జంక్షన్ వద్ద జరిగింది. మండలంలోని చిన్న చీపురువలసకు చెందిన తోట సోమమ్మ (64) మృతి చెందింది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పొలం పనుల నిమిత్తం కోట సోమమ్మ మండలంలోని కర్రివలస వెళ్ళింది. వర్షం కురవడంతో పనులు నిలిపివేసినందున తిరిగి ఇంటికి వెళ్లిపోయేందుకు తోటి కూలీలతో కలిసి ఆటో ఎక్కింది. ఆటో డ్రైవర్ అతివేగంగా నడపడంతో అదుపుతప్పి చీపురువలస సమీపంలో పొలంలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. సోమమ్మ ఆటో కింద పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికుల సహాయంతో సాలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. సోమమ్మ భర్త కోట పారయ్య పాచిపెంట పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశాడు. భర్త ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్సై వెంకట సురేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లా స్థాయి యోగా పోటీలను పర్యవేక్షించిన డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - పార్వతీపురం

యోగాంధ్ర మాసోత్సవ కార్యక్రమాల్లో భాగంగా కలెక్టరేట్ లో నిర్వహించిన జిల్లా స్థాయి యోగా పోటీలను జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు మంగళవారం పర్యవేక్షించారు. జిల్లాలో వివిధ మండల, పట్టణ స్థాయి యోగాంధ్ర పోటీల్లో గెలుపొందిన వారికి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో యోగా పోటీలు నిర్వహిస్తున్నామని, శనివారం వరకు ఈ పోటీలు కొనసాగుతాయన్నారు. యోగా గురు మోహన్ గంటాయత్ బృందంతో కూడిన ఐదుగురు సభ్యులు జిల్లా స్థాయి పోటీలకు న్యాయనిర్ణేతలుగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. యోగాంధ్ర జిల్లా కన్వీనర్ డాక్టర్ టి. జగన్మోహనరావు కార్యక్రమాన్ని షెడ్యూలు ప్రకారం జరిగేలా సమన్వయం చేస్తూ కార్యాచరణ చేయడం జరుగుచున్నదని అన్నారు. పోటీల వద్ద వైద్య సిబ్బంది మెడికల్ కిట్ అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ సుశీల, ఎంపిడిఒ జి.రమేష్, జిల్లా కన్సల్టెంట్ డా రఘు, యోగా మాస్టర్లు మోహన్ గంటాయత్, జనార్ధనరావు, డాక్టర్ జయశ్రీ, డాక్టర్ కె.వర్మ, డెమో సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

ప్రజాశక్తి - పాలకొండ

దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ కిల్లి విజయపార్వతి తెలిపారు. మంగళవారం స్థానిక ఇందిరానగర్ కాలనీలో గల ప్రభుత్వ గిరిజన హాస్టల్‌లో దోమల నివారణకు ద్రావణంతో పిచికారీ చేయించారు. వర్షకాలానికి ముందే అన్ని గ్రామాలు, ప్రభుత్వ భవనాల్లో ఈ విధంగా ద్రావణంతో పిచికారీ చేయిస్తామని పేర్కొన్నారు. ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో పట్టణ పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ కె.తేజ్ రతన్ రాజ్, సబ్ యూనిట్ అధికారి మోహన రావు, హెచ్.వి.రమణమ్మ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు